క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జాతీయ స్థాయిలో నిర్వహించనున్న స్వచ్ఛోత్సవ్ 2023లో భాగంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హుస్నాబాద్ పట్టణంలోని అన్ని రంగాల మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ సేవలు, మున్సిపల్ చెత్త సేకరణ, రవాణా, వేస్ట్ టూ వెల్త్ ఉత్పత్తులు, సాలిడ్ వేస్ట్ నిర్వహణ, ఐఈసీ, ట్రైనింగ్, సాంకేతిక ఆవిష్కరణ కార్యక్రమాల్లో పట్టణ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఐదుగురు మహిళలను రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఈ నెల 15వ తేదీలోగా మున్సిపల్ కార్యాలయంలో తమపేర్లను వివరాలతో కూడిన దరఖాస్తును నమోదు చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

రైతు సమస్యలు పరిష్కరించడంలో విఫలం


దీక్షలో కూర్చున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు దీక్ష చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రఘువీరారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి రాములు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయ్యారని ఆరోపించారు. లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే రుణమాఫీ చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): తక్షణమే పంట రుణమాఫీ చేయాలని కోరుతూ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మద్దూరు తహసీల్దార్ భూపతికి బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు దాసరి రామకృష్ణారెడ్డి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్ర నర్సయ్య, మట్ట శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

హుస్నాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం భారత జాగృతి, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ హాజరై కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, భారత జాగృతి నాయకులు కిషన్‌నాయక్, తిరుపతినాయక్, రాజునాయక్, సత్యంనాయక్, రాంచంద్రంనాయక్, రమేశ్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్ తదితరులు ఉన్నారు.

వైభవంగా బీరప్ప కల్యాణం


ఉత్సవాల్లో ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: మండలంలోని రిమ్మనగూడ గ్రామంలో నాలుగు రోజులుగా బీరప్ప కామరతి కల్యాణోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకొని రోజూవారీగా ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కల్యాణంలో సోమవారం ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు.

శబరిమలలో వసతి గృహ భవన ఏర్పాటుపై హర్షం

వర్గల్(గజ్వేల్): తెలంగాణ ప్రాంత భక్తులకు సౌకర్యవంతంగా వారణాసి, శబరిమలలో సీఎం కేసీఆర్ రూ.25 కోట్ల వ్యయంతో వసతి గృహ భవన నిర్మాణాల ఏర్పాటుకు ముందుకు రావడం హర్షనీయమని పలువురు నాయకులు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం వర్గల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, అయ్యప్ప సేవాసమితి ప్రతినిధులు డాక్టర్ గణేశ్, వెంకటేశ్, మహేశ్ పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ ఇళ్లు కేటాయించాలి

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో పేదలు సోమవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇళ్ల కేటాయింపులో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి, అనర్హులను జాబితా నుంచి తొలగించిన తర్వాతే రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభానికి రావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంజీవరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పద్మ పాల్గొన్నారు.

కోహెడ అభివృద్ధికి సహకరించాలి

- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- మండల సభలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కోహెడ(హుస్నాబాద్): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొక్కుల కీర్తి సురేశ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పని చేయాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి త్వరగా పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో చెరువులు, కుంటల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలాగే రైతులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ అధికారులు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. మండలంలో నెలకొన్న భూసమస్యలను ధరణి ద్వారా పరిష్కారం చేస్తామన్నారు. మొకపై ఉన్న రైతులకు ధరణి ద్వారా ఆన్‌లైన్ చేసే విధంగా జిల్లా కలెక్టర్‌కు తెలియజేస్తామన్నారు. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూ, రెవెన్యూపై రివ్యూ నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీకి జనాభా ప్రాతిపదికనా నిధులు కేటాయిస్తున్నామన్నారు. అంతకు ముందు వివిధ శాఖలపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు సమస్యలు వినిపించారు. పలు గ్రామాలకు మిషన్ భగీరథనీరు రావడం లేదని వేసవి కాలంలో ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని సమస్యను పరిష్కారించాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా రాంచంద్రాపూర్ గ్రామంలో వంతెన రోడ్డు గుంతలమయంగా మారిందని సర్పంచ్ నోముల పద్మకొండల్‌రెడ్డి అధికారులకు విన్నవించారు. ధరణిలో భూ సమస్యలు పరిష్కారం కావడంలేదని రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగరాజు శ్యామల, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్ రావు, ఎంపీడీవో మధుసూదన్, వైస్ ఎంపీపీ తడకల రాజిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనవైపు అడుగులు వేయాలి


మెహందీ పోటీల్లో మహిళలు

హుస్నాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మున్సిపల్ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, మెహంది, మ్యూజికల్ చైర్ ప్రోగ్రామ్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక స్వావలంబనవైపు అడుగులు వేయాలన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో మహిళలు రాణించాలన్నారు. విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు నళినిదేవి, రమాదేవి, పద్మ, సుప్రజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మెప్మా సీఓ రాజు, ఆర్పీలు పాల్గొన్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు


భూమిపూజ చేస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ వైద్యరంగానికి పెద్దపీట వేస్తూ విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారని ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఔట్ పేషెంట్ విభాగానికి సంబంధించి రూ.20లక్షలతో చేపడుతున్న గదుల నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తూ నాణ్యమైన వైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రజలకు నమ్మకం మరింత పెరిగిందన్నారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ నాగేంద్ర, మెడికల్ ఆఫీసర్ ప్రణయ్‌రాజ్, ఫ్యాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామొద్దీన్ పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): దళితబంధు 2వ విడత కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం చిన్నకోడూరులో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ రామచంద్రం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. అభివృద్ధి సంక్షేమానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. దళితబంధు పథకం ఎన్నో కుటుంబాలకు అండగా నిలుస్తుందన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే దళితులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉమేశ్‌చంద్ర, బాబు, నాయకులు రాజలింగం, ఆనంద్, రఘు, శ్రీకాంత్, శ్రీనివాస్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


ఉపాధ్యాయులతో విద్యార్థులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వల్లంపట్ల గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలభాస్కర్, ఎస్ఎంసీ చైర్మన్ గుంటుపల్లి భార్గవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

కొండపాక(గజ్వేల్): 'మన ఊరు–మన బడి' పథకంలో జరిగిన పనులను ప్రారంభానికి సిద్ధం చేసుకోవాలని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన పనులను సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఉండేలా ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టిందన్నారు. ఏప్రిల్ మాసం మొదటి వారంలో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు జరిగేలా ముహూర్తం ఖరారు చేశారన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో 124 మంది విదార్థులుండడం ఉపాధ్యాయులు అదృష్టంగా భావించుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలనలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారితో కలిసి ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రాంచంద్రం, ఉపాధ్యాయులు లావణ్య, సత్యకృష్ణ, తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యపై ప్రత్యేక దృష్టి

దుబ్బాక మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి, కౌన్సిలర్ లలిత

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీలో డ్రైనేజీ సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టామని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 16వ వార్డులో కౌన్సిలర్ దేవుని లలితచంద్రయ్యతో కలిసి బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ నిర్మాణాలు జరిగితే మురికినీటి సమస్యతో పాటు దోమల బెడద తప్పుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు తదితరులు ఉన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ సహకారంతో శనగల కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ వంగ చంద్రారెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశం, వైస్ చైర్మన్ పుర్మవెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, సతీష్, ముస్త్యాల సర్పంచ్ ఎల్లారెడ్డి, మాధవరెడ్డి, కమలాకర్, మార్కెట్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటాలి


క్రికెట్ కిట్‌ను అందిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ వంశీధర్‌రావు

సిద్దిపేటరూరల్: యువకులు క్రీడల్లో ప్రతిభను చాటి ఉన్నత స్థాయికి ఎదగాలని కల్వకుంట్ల రంగారావు ఫౌండేషన్ చైర్మన్ వంశీధర్‌రావు అన్నారు. సోమవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ ట్రోఫీలో ఆడనున్న క్రికెట్ టీం 14 జట్లకు రంగారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వెంకట్, యూసఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు


ఎల్లమ్మకు పూజలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ 47వ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో సోమవారం ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, గౌడ సంఘం నాయకులు మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం పలికారు. అర్చకులు మంత్రికి తీర్థప్రసాదాలను అందించారు. ఆలయ ఆవరణలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి వెంట ప్రజాప్రతినిధులు, అధికారులు, గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సిద్దిపేటజోన్: నియోజకవర్గ పరిధిలోని 126 మంది లబ్ధిదారులకు సాయంత్రం క్యాంపు కార్యాలయంలో రూ.38.33లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి హరీశ్‌రావు పంపిణీ చేశారు. అంతకుముందు ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందిన చింతమడక గ్రామానికి చెందిన రఫిక్, అదేవిధంగా లక్ష్మిదేవిపల్లికి చెందిన లక్ష్మయ్య కుటుంబాలకు పార్టీ పక్షాన రూ.2లక్షల చొప్పున బీమా చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు శర్మ, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, సాయిరాం, సంపత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండలంలోని పలువురి మృతుల కుటుంబాలను సోమవారం మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ ఎవరూ అధైర్యపడొద్దని, అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఇబ్రహీంపూర్‌కు చెందిన గ్రామ బీఆర్ఎస్ కార్యకర్త మొలుగు బుగ్గయ్య, మండల కేంద్రమైన నారాయణరావుపేటలో అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షురాలు పద్మ, బీఆర్ఎస్ కార్యకర్త శ్రీనివాస్ కుటుంబాలను ఆయన పరామర్శించారు.

నైపుణ్యం కలిగినప్పుడే అపారమైన అవకాశాలు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుల్లోనే కాకుండా ఇతర రంగాల్లో నైపుణ్యం కలిగినప్పుడే అపారమైన అవకాశాలు లభిస్తాయని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సోమవారం రూబికన్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ చంద్రవదన పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందరికీ ఉద్యోగాలను కల్పించలేదని, ప్రైవేట్ సెక్టార్‌లో విద్యార్థులు ఉద్యోగాల కోసం ప్రయత్నించాలన్నారు. మార్కెట్ డిమాండ్‌ను బట్టి విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, టీఎస్‌కేసీ సమన్వయకర్త ప్రవీణ్‌కుమార్, మెంటర్ మహ్మద్‌జబ్బార్, విద్యార్థులు పాల్గొన్నారు.

'అక్కన్నపేట అభివృద్ధిలో వెనుకంజ'


దీక్షలో కూర్చున్న బీజేపీ నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంగా ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు అభివృద్ధిలో వెనుకంజలో ఉందంటూ నిరసిస్తూ సోమవారం అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి తొందూరు ఎల్లయ్య 'రిలే నిరాహార దీక్ష'కు దిగారు. ఈ సందర్భంగా అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి పూల దండను వేసి రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. అనంతరం స్థానిక బీజేపీ నాయకులు సంపూర్ణ మద్దతు తెలుపుతూ దీక్షలో కూర్చున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి కృషి చేయడం లేదని, అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారే తప్పా అభివృద్ధి గురించి ఆలోచించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో పురాతన శివాలయానికి రూ.కోటి నిధులు మంజూరు చేయాలన్నారు. అన్నీ ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా సమీకృత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్టీ,ఎస్సీ బాలుర హాస్టల్, మార్కెట్ యార్డుకు 10 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు నూనావత్ మోహన్‌నాయక్, నాయకులు భూక్య సుధాకర్‌నాయక్, చెరుకు సంపత్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐగా పదోన్నతి


పరమేశ్వరిని అభినందిస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మహిళ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పరమేశ్వరి ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆమె సీపీ కార్యాలయంలో సీపీ శ్వేతను సోమవారం కలిశారు. ఏఎస్ఐగా పదోన్నతి పొందిన పరమేశ్వరికి సీపీ శ్వేత స్టార్‌ను అలంకరించి, అభినందించారు. సీపీ మాట్లాడుతూ.. పదోన్నతితో బాధ్యతలు కూడా పెరుగుతాయని, ఉద్యోగం సక్రమంగా నిర్వహించి డిపార్ట్‌మెంట్‌లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మర్పడ్గలో రూ.20 లక్షలతో నిర్మించనున్న మహిళా సంఘ భవన నిర్మాణానికి సోమవారం సర్పంచ్ ఏమల్ల రజిత భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లికార్జున్, నాయకులు చిటుకుల సురేందర్‌రెడ్డి, గ్రామ పంచాయితీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం


సిద్దిపేటకమాన్: వృద్ధురాలికి అద్దాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ మంజుల

గజ్వేల్‌రూరల్: అంధత్వ నివారణకు ప్రభుత్వం కంటివెలుగుకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. మండలంలోని సింగాటంలో సోమవారం ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీపీ అమరావతి, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు బెండ మధుతో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రమేశ్, బుచ్చిరెడ్డి, సంతోష్‌రెడ్డి, స్వామి పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: కంటి వెలుగు కార్యక్రమం ఎంతోమంది పేదల జీవితాల్లో వెలుగు నింపిందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. పట్టణ పరిధిలోని 37వ వార్డులో నిర్వహించిన శిబిరాన్ని సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, వార్డు కౌన్సిలర్‌తో కలిసి చైర్‌పర్సన్ ప్రారంభించారు.

సంక్షిప్త వార్తలు

◆ బాధితుడికి సాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భూంపల్లి మండలం పోతరెడ్డిపేట గ్రామానికి చెందిన కాశీనాథ్‌కు రెండు కిడ్నీలు చెడిపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో బాధితుడికి రూ.25,000 ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కాసం నవీన్‌కుమార్, వ్యవస్థాపక అధ్యక్షుడు అయిత రత్నాకర్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల పాండు, కార్యదర్శి గంగిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

దుబ్బాక: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం దౌల్తాబాద్ మండలం లింగరాజ్‌పల్లి గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఆత్మ గౌరవయాత్రను నిర్వహించారు. గ్రామంలో గడప గడపకు తిరుగుతూ ప్రజల కష్టాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

◆ చలివేంద్రాలు ప్రారంభం

హుస్నాబాద్: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు బీజేపీ నియోజకవర్గ నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, మల్లెచెట్టు చౌరస్తాలో ఏర్పాటు చేసిన జేఎస్ఆర్ చలివేంద్రాలను బీజేపీ నాయకులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి శ్రీనివాస్, కార్యదర్శి కుమార్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ వేణుగోపాల్‌రావు, మండల అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శంకర్‌బాబు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి స్వరూప ఉన్నారు.

◆ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

సిద్దిపేటకమాన్: పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యనిర్వాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన రెండు విడతల కరువు భృతిని వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీ కమిటీ వేయాలని, వెల్‌నెస్ సెంటర్లను సక్రమంగా నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో చంద్రారెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ స్వచ్ఛభారత్ మిషన్ శిక్షణ తరగతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం స్వచ్ఛభారత్ మిషన్(గ్రామీణ) ఫేస్2 నిర్వహణలో భాగంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఫీల్ట్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులను ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ కవికుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

దుబ్బాకటౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు మంచి ఫ్యాకల్టీతో పాటు సౌకర్యాలు ఉన్నాయని దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.రమేశ్ అన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో దోస్త్(డిగ్రీస్ ఆన్‌లైన్ సర్వీసెస్ ఇన్ తెలంగాణ) 2023–24 విద్యా సంవత్సరానికి చెందిన అడ్మిషన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు స్వాతి, సునిత, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, చందన తదితరులు ఉన్నారు.

◆ రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

సిద్దిపేటకమాన్: రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 11, 12వ తేదీల్లో 24 గంటల దీక్ష కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రాంలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అరుణారెడ్డి, విజయరెడ్డి, పద్మ, విజయ, ఉమారెడ్డి పాల్గొన్నారు.

◆ పారిశుధ్య కార్మికుల భిక్షాటన

మర్కూక్(గజ్వేల్): పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో సోమవారం మర్కూక్‌లో కార్మికులు ఇంటింటికీ తిరుగుతూ, కిరాణ దుకాణాల వద్ద భిక్షాటన చేశారు. పారిశుధ్య కార్మికుల భిక్షాటనకు బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ఆరోగ్యంతో చెలగాటం ఆడుతూ స్వచ్ఛ గ్రామాలుగా తీర్చేదిద్దే కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

◆ ఘనంగా బోనాలు

దుబ్బాకరూరల్: మండలంలోని పోతారం గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో సీతలాదేవి–మడెల్‌రాజు విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు తీశారు. అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో ఉదయం చౌడలమ్మ కల్యాణం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి బోనాలు తీశారు.

◆ సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అత్తు మాట్లాడుతూ.. ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కవిత మద్యం కుంభకోణం కేసు విచారణ సమయంలో ఆ పార్టీకి చెందిన మంత్రులు ఢిల్లీలో తిష్ట వేశారని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు మితిమీరిపోతున్నాయన్నారు.